
ఇంకుడుగుంతలపై పట్టింపేది?

- నిర్మాణంపై ఆసక్తి చూపని పట్టణ ప్రజలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- అవగాహన కల్పించని బల్దియా అధికారులు



ఆదిలాబాద్ పట్టణం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధి క్రమంగా విస్తరిస్తోంది. ప్రతీ ఏడాది కొత్తగా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ఎటు చూసినా.. కాంక్రీట్ జంగల్‌గా పరిస్థితి మారిపోతుంది. వర్షాకాలంలో కురిసిన వర్షపునీరు భూమిలోకి ఇంకే పరిస్థితి కన్పించడం లేదు. అందుకు ఉపకరించే ఇంకుడుగుంతల నిర్మాణాలపై బల్దియా అధికారులు దృష్టిసారించడం లేదు. ఇంటి నిర్మాణ సమయంలో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించుకుంటామని అనుమతి పొందుతున్న ప్రజలు కూడా వాటిని నిర్మించుకోవడం లేదు. నీటి సంరక్షణ కరువై భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.

నిర్మాణాలపై అనాసక్తి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణ పరిధిలో 300 గజాలకు పైగా స్థలం ఇళ్లు, అపార్ట్‌మెంట్ నిర్మించుకోవాలంటే సెట్ బ్యాక్‌తో పాటు ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరి. కాంక్రీట్ వినియోగం పెరిగిపోయి నీటి సంరక్షణ చర్యలు లేకపోవడంతో కొత్తగా ఇళ్లు నిర్మించే వారు ఇంకుడుగుంత నిర్మించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఇంకుడుగుంత నిర్మాణం కోసం ఒక్కో స్క్వేర్ మీటర్‌కు రూ.15 చొప్పున వసూలు చేస్తోంది. ఇంకుడుగుంతను నిర్మించుకున్నట్లుగా నిర్మాణదారులు ఆధారాలు చూపితే తిరిగి సొమ్మును వారికి చెల్లించాలనేది ప్రభుత్వ నిబంధన. పట్టణంలో ప్రతీ నెల పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలతో పాటు అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఇందులో ఒకరిద్దరు తప్పా.. ఎవరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం లేదు.

పట్టణంలో 164 మాత్రమే..

ఇంకుడుగుంతల ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం ఆదిలాబాద్ పట్టణంలో వాటి పరిస్థితిపై గతేడాది ప్రత్యేక సర్వే చేయించింది. దీంతో రంగంలోకి దిగిన బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు 300 గజాలకు పైగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోనూ సర్వే నిర్వహించారు. పట్టణ పరిధిలో మొత్తం 48,393 అసెస్‌మెంట్లు ఉండగా అందులో కేవలం 169 మాత్రమే ఇంకుడుగుంతలు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. ఇందులో ఇండ్లలో 27 ఉండగా ప్రభుత్వ కార్యాలయాల్లో 69, ప్రైవేట్ భవనాల్లో 95 ఉన్నట్లుగా నిర్ధారించారు. అలాగే రూఫ్ హార్వెస్టింగ్ సిస్టమ్ ప్రభుత్వ కార్యాలయాల్లో 30, ప్రైవేట్ భవనాల్లో 39 చొప్పున 69 మాత్రమే ఉన్నట్లుగా లెక్క తేల్చారు. కాగా ఇందులో కేవలం 69 మాత్రమే వినియోగంలో ఉండగా మరో 29 మరమ్మతులకు గురైనట్లుగా అధికారులు గుర్తించారు. ఈ లెక్కన పట్టణ ప్రజలు ఇంకుడుగుంతలకు ఏ మేరకు ప్రాధాన్యతనిస్తున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అభిప్రాయం వ్యక్తమవుతుంది.



ఇంటి వద్ద నిర్మించుకున్న ఇంకుడుగుంత

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



కొత్తగా నిర్మించే ప్రతీ ఇంటి యజమాని ఇంకుడు గుంతను విధిగా నిర్మించుకోవాలి. అందుకోసం డబ్బులు చెల్లించి బల్దియా కార్యాలయం నుంచి అనుమతులు తీసుకుంటున్నప్పటికీ చాలా మంది వాటిని నిర్మించుకోవడం లేదు. ఇంకుడుగుంత ఉన్నట్‌లైతే వర్షపునీటిని, వృథా నీటిని సంరక్షించి భూగర్భజలాలను పెంపొందించుకునే అవకాశముంది. భవన నిర్మాణ యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

– సుమలత, పట్టణ ప్రణాళికాధికారి

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

నేరడిగొండ: మహిళ సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోనాల మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకురాలు మడావి రమాదేవి కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శాలువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ సాధికారత కోసం కృషి చేస్తుందని, మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, ఇలా అనేక పథకాలు అందిస్తూ అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సోనాల మండల సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ బత్తుల, బద్దం పోతారెడ్డి, సద్దాం, పాల శంకర్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గజేందర్

అవమానించేలా మాట్లాడటం సరికాదు

ఆదిలాబాద్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న రైతుల పక్షాన ఉండి నిలదీస్తే ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అవమానించేలా మాట్లాడటం సరికాదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో జరిగిన అవినీతి గురించి ప్రశ్నించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు యాసం నర్సింగ్‌రావు, రాజన్న, జగదీష్, అశోక్, విఠల్, ముఖీమ్, సూర్యకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్టు ప్రహ్లాద్

టీకాలతోనే వ్యాధుల నివారణ

తలమడుగు: వేసవిలో పశువులకు సోకే వ్యాధులను ముందస్తుగా నివారించేందుకే టీకా వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి లావణ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశుపోషకులు తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. జొన్న పంట తీసిన తర్వాత లేత జొన్న ఆకులు వస్తాయని వాటిని పశువులు తినకుండా చూడాలన్నారు. లేత ఆకులు తిన్న పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



టీకా వేస్తున్న పశు వైద్యాధికారి లావణ్య

పత్రిక స్వేచ్ఛపై దాడి సరికాదు

బోథ్: సాక్షి, ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంట్లో ఎలాంటి సమాచారం, నోటీసు లేకుండా పోలీసులు సోదాలు చేయడంపై బోథ్ ప్రెస్‌క్లబ్ గురువారం ఖండించింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సూది నరేశ్ మాట్లాడుతూ.. ప్రజల వైపు పత్రికలు ఉంటాయని, వార్తలు రాస్తే పత్రికలపై దాడులు చేయడం, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ధనుంజయ్‌రెడ్డిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. కేసులను వెంటనే కొట్టివేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమణ గౌడ్ గొడిసెల, కోశాధికారి సంతోష్, విలేకరులు పాల్గొన్నారు.

జైనథ్‌లో నీటి కష్టాలు



జైనథ్ మండల కేంద్రంలో 12వార్డులో నీటికష్టాలు మొదలయ్యాయి. కాలనీలోని ఏ ఒక్క బోరు నుంచి కూడా నీరు రావడం లేదు. చుక్క నీరు కోసం ప్రజలు అల్లాడుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు నీరు లభించడం లేదని వాపోతున్నారు. నీటి ట్యాంకర్ల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– జైనథ్

సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు

నార్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్య బోధన చేయాలని సూచించారు. ఆమె వెంట సీఆర్పీ దేవాదాస్, తదితరులు పాల్గొన్నారు.

బోరుబావితో నీటి సమస్య పరిష్కారం



భూమిపూజ చేస్తున్న ఆడే శీలా రాజేశ్వర్

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలు తరుచూ ఎదురవుతున్న నీటి సమస్యను కాలనీవాసులు మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా రాజేశ్వర్ దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం ఆమె బోరు వేయించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో బోరుబావి వేసి సమస్యను తీర్చడం జరిగిందన్నారు. ఆమె వెంట సీనియర్ నాయకులు అంకతి రవీందర్, నాగ్‌నాథ్ అప్పా, ససానే మాధవ్, చట్ల మహేందర్, మారుతి, కైలాస్, శేఖర్ గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం కాలనీకి చెందిన ఆదివాసీ మహిళ కుడిమేత దుర్పతబాయి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. కాగా.. బాధిత కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ.5వేల నగదును ఆదిలాబాద్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట నాయకులు ఫైజుల్లాఖాన్, వాంఖడే వామన్, మేకల జితేందర్, పాండురంగ్, సతీష్, స్వప్నిల్ ఉన్నారు.

రైతులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్న విక్రయించేందుకు వచ్చిన రైతులకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజుయాదవ్ అన్నదానం నిర్వహించారు. బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్నదానం ప్రారంభించారు. జొన్న కొనుగోళ్లు పూర్తయ్యే వరకు నిత్యాన్నదానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, పోతారెడ్డి, చట్ల ఉమేష్, గాజుల పోతన్న, అబుద్, అబ్రార్, గడ్డల నారాయణ, రహీమొద్దీన్ పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతి పాటించాలి

బోథ్: రైతులు పంట మార్పిడి పాటించాలని శాస్త్రవేత్తలు ప్లాంట్ పాథాలజీ ప్రొఫెసర్ రాజేశ్వరి, అగ్రోనమీ ప్రొఫెసర్ మంజులత అన్నారు. గురువారం పట్నాపూర్ రైతువేదికలో వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో క్రిమిసంహారక ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. జిల్లాలో సాగుచేసే ముఖ్యమైన పంటల్లో విత్తన శుద్ధి, సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అధిక సాంద్రతలో పత్తి సాగుపై రైతులతో చర్చించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి మాట్లాడుతూ వ్యవసాయంలో చేపట్టాల్సిన సాంకేతిక పద్ధతులు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి రవితేజ, ఉద్యానవన అధికారి, వెటర్నరీ అసిస్టెంట్, డ్రీమ్స్ ఫౌండేషన్ తరఫున ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ఆదివాసీలకే ఇళ్లు కేటాయించాలి

నార్నూర్: ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి ఏజెన్సీ చట్టాలను అనుసరించి ఆదివాసీలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా కొంతమంది గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరిగిందన్నారు. దీని వలన అర్హులైన ఆదివాసీలకు పథకం అందడం లేదన్నారు. 6 ఇళ్లు మాత్రమే గిరిజనులకు, 12 గిరిజనేతరులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్కా గోవింద్

'మనోభావాలను దెబ్బతిస్తే ఊరుకోం'

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ యార్డులో హమాలీలుగా పని చేస్తున్న వారిపై ఇష్టానుసారంగా మాట్లాడి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించే నాయకులకు గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి అన్నారు. గురువారం మార్కెట్‌యార్డులో హమాలీలతో కలిసి మాట్లాడారు. మాటలు వెంటనే వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్‌లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. హమాలీలు కష్టపడి పనిచేసే వారని అన్నారు. వారి కష్టాన్ని గుర్తించకుండా మాటలు అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో కారెం రవి, అన్నెపాక అశోక్, హమాలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామి

పోడు భూములకు హక్కులు కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: పోడు భూములకు హక్కులు కల్పించాలని పోడు భూముల గిరిజనేతరులు శ్రీనివాస్, హకీం, సాంబన్న, శంకర్, భీమన్న, లింగన్న, మల్లన్న డిమాండ్ చేశారు. గురువారం గంగాపూర్, దంతన్‌పల్లి గ్రామాల గిరిజనేతర రైతులు ఉట్నూర్ అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్లుగా తాత ముత్తాల నుంచి పోడు భూములను సాగు చేస్తున్నామన్నారు. పోడు భూములకు గత ప్రభుత్వాలు పహాణీలు ఇచ్చి బ్యాంకుల ద్వారా లోన్‌లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అటవీ అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. మా బతుకులు పోడు భూముల మీదనేనని, ఇప్పుడు ఫారెస్టు అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. రైతులకు కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, ఎక్బాల్, దూట రాజేశ్వర్ మద్దతు తెలిపారు.



ధర్నా చేస్తున్న గిరిజనేతర రైతులు

రాజకీయ అధికారమే అన్నింటికీ పరిష్కారం

ఇచ్చోడ: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ అధికారమే అన్నింటికీ పరిష్కారమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నా రు. లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రలో భా గంగా గురువారం కోకస్‌మన్నూర్ లో రోడ్ షో నిర్వహించారు. అంతకుముందు ఇచ్చోడలోని ప్రా థమిక ఆరోగ్య కేంద్రం, పౌరసరఫరాల గిడ్డంగిని పరిశీలించారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పేదవర్గాలకు విద్యా, వైద్యం, ఉపాధి, భూ మి ఇల్లు సాధించేందుకే మాభూమి రథయాత్ర చేపట్టినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అన్నెల లక్ష్మణ్, శేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రవీణ్, భరత్, పవన్ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న విశారదన్ మహరాజ్

ఇబ్బంది పెట్టకుండా పంట కొనుగోలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇబ్బందులు లేకుండా జొన్న పంట కొనుగోలు చేయాలని రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన జొన్న పంటను గ్రామాల వారీగా కొనుగోలు చేసే విధంగా ప్రణాళికతయారు చేయాలన్నారు. ఆదిలాబాద్, మావల, తలమడుగు మండలాల్లో జొన్న పంట 22,428 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 48,302 క్వింటాళ్ల జొన్న పంట కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అకాల వర్షం పడే అవకాశం ఉండడంతో రైతులకు గన్ని బ్యాగులు ఇచ్చి త్వరగా పంట కొనుగోలు చేయాలని కోరారు. ఆయన వెంట రైతులు నవీన్, ప్రవీణ్, రామకృష్ణ, రమేశ్, స్వామి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

నార్నూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని ఆర్యభట్ట పాఠశాల మైదానంలో భవిష్యత్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఆదివాసీ విద్యార్థులను సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మోటివేషన్ స్పీకర్ తొడుసం గోపాల్, రాయిసెంటర్ సార్‌మేడిలు జుగ్నక భీంరావు, మండడి దౌలత్ రావు, మాడవి భారత్, కొడప జాకు, రామారావు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని నవేగావ్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్నందున లబ్ధిదారులు నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు దశగా వారీగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సైకి సన్మానం

జైనథ్: జైనథ్ మండల కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన గౌతమ్‌కు గురువారం బీజేపీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, ప్రతాప్ యాదవ్, ఏనుగు రాకేశ్‌రెడ్డి, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దినేష్ మటోలియా, ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణరావును మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కలిశారు. గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

నేడు వాహనాల వేలం

ఇచ్చోడ: ఇచ్చోడ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి గలవారు వేలం పాటలలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లు

ఇచ్చోడ: ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన కళాశాలలో మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు గ్రూప్స్, కెరీర్ గైడెన్స్ లాంటి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కోరారు.

కొనుగోళ్లు ప్రారంభించండి

బోథ్: సొనాల మండల కేంద్రంలో ఇటీవల జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా.. కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదని గ్రామస్తుడు తుల హరీశ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకే రైతులు వెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో దూరభారం పెరిగి, రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి సొనాల మండల కేంద్రంలో జొన్నల కొనుగోళ్లు చేపట్టాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోథ్: సొనాల మండలంలోని ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ మడావి రమాదేవి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేశ్, బద్దం పోతారెడ్డి, సద్దాం, పాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.